


ఉండి ఉండి హఠాత్తుగా గుర్తు కొస్తుంది ప్రభుత్వం వారికి — సంఘానికి వెన్నెముక బడిపంతులని, భావిపౌరులని తీర్చిదిద్దవలసిన బరువు బాధ్యతలు అతడివేనని వెంటనే మిగిలిన పనులు పక్కకినెట్టి నిమిషాల మీద ఒక ట్రైనింగ్ కోర్స్ అనో, ఒక సమావేశమనో ఏర్పాటు చేస్తారు. వచ్చే జీతాన్ని నెల రోజులకి సర్దటమన్న మహా యజ్ఞంలో సతమతమయే సదరు బడిపంతులు దొరికినవాడి దగ్గర అప్పుచేసి పట్నం వచ్చి పడతాడు.

అటువంటి సమావేశాల కొకదానికి దిగబడి ఒళ్ళు హూనం చేసుకుని తిరుగు ప్రయాణానికి బస్స్టాండు దగ్గరకు వచ్చాను. అప్పటికే అయిదయిపోయింది. కుర్రకారు—ఇంకా జీవితపు భారాలు నెత్తిన వేసుకోనివారు—సినిమాలు దర్శించి మర్నాడు వెంచేద్దామని ఉండిపోయారు. కాని నాలాటి వాడికి ఒక రాత్రి గడిచినకొద్దీ అన్ని విధాలా ఇబ్బందే! పైగా అటువంటి సరదాలు చంపుకుని నిర్వికల్ప సమాధిలో మునగకపోతే సంసార సాగరాన్ని ఈదడం అన్నది అసంభవమని గ్రహించి సినిమాలు, అనవసరంగా హోటళ్ళు వగయిరా కోర్కెలని దూరం ఉంచడం నేర్చుకున్న వాడి నవటాన పని అయి[illegible] గానే నేరుగా బస్సుల వేటలో పడ్డాను.

అక్కడికి చేరుకోగానే నేను సేకరించిన స[illegible] చారం—ప్రస్తుతం సిద్ధంగా బస్సులు లేవని, [illegible] నవే తిరిగి వెళ్ళవలసి ఉంటుందనిను. వెళ్ళవలసి నడుమ నవసరంలేని ఊరు కావడాన, చేరుకోవలసి స్వంత ఇంటికే అయినందున తాపీగా కూర చుట్టూ కలయచూశాను.

నా దృష్టికి—చేతిలో మరచెంబు, చంకలో గొ[illegible] దాని ప్రక్కగా జంబుఖానాతో చుట్టబడిన [illegible]

నక్క చేట్టలతో వడివడిగా వెళ్తూ ఉమాపతిగారు అగబడ్డారు.

అసలు "బతకలేక బడిపంతులు" అన్న సామెత ఉన్నా, కొంతమంది షుమారుగా బ్రతక గలిగినవారు కూడా ఇందులోకి జొరబడుతుంటారు. భావి పౌరులని తీర్చిదిద్దుదామని కాని, సేవ చేద్దామని కాని కాదు. కేవలం కదలిక లేకుండా ఉన్న ఊళ్లో పడి ఉండవచ్చునని. మధ్య మధ్య పై దేముళ్ళలో ఎవరికయినా అలక వచ్చి స్థాన చలనం కలిగించినా, మళ్ళీ ఆ అలక పోగానే స్వస్థానం చేరుకోగల అవకాశాలున్నాయి ఇందులో.

అదుగో అటువంటి శాప సమయాల్లో ఒకసారి ఆయన మా ఊరికి పంతులుగా బదిలీ అయాడు. మొత్తానికి ఆరు నెలల కాలం పాటు ఆ శాపాన్ని తిప్ప లేకపోయాడు. నా పరిచయం ఆయనతో ఆ కాలం లోనే!

"నమస్కారం మాస్టరుగారూ! మీరూ ఇవ్వాళే వస్తారనుకోలేదు సుమండీ. లేకపోతే పిలిచి ఉండే వాడిని!" అన్నానుఆయన్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తూ.

"ఏదీ మీకూ తెలియని దేముంది, ఈ రెండు రోజుల్లో నేను ఎంగిలి పడింది ఒక్కపూట మాత్రం. ఊళ్లో ఎరిగిన పీనుగ ఒక్కడూ లేకపోయె!...... ఏదో పాపం ఆయన పుణ్యమా అని ఇక్కడి తెలుగు మాష్టరుగారు ఈ పూట నా వాలకంచూసి ఉపో షాలని పసికట్టి ఇంటికి పిలిచాడు. కాబట్టి కొంచెం ఓపికగా ఉంది ఇప్పుడు!......అయినా వీళ్ళ ట్రయి నింగ్‌లు, కాన్ఫరెన్సులు మా కెందుకండీ! తెలుగంటే ఒక్క వెధవ లక్ష్యం పెడతాడా? పోనీ ఈ చెప్పే వాళ్ళకి గౌరవం పోతే!......ఇంతకీ ఈ బస్సు ఈ రాత్రికి అఘోరించేనా?"

"వస్తుందిటలెండి. రాత్రికి చేరుకోగలం. ఇక ఎక్కడం అంటారా ఎవళ్ళం ముందు ఎక్కితే వారు రెండవ వారికి స్థలం ఉంచుదాం. కాసేపు మనం పంతుళ్ళమన్న విషయం మర్చిపోయి కుర్రాళ్ళం అనుకుంటే సరి—అవలీలగా ఎక్కిపోగలం" అన్నాను నవ్వుతూ.

కాని ఆయన నా మాట వినిపించుకున్నట్టు లేదు. కండువా పెట్టి, ముఖాన్ని తుడుచుకుని ఉస్సు రంటూ అరుగుమీద చతికిలబడ్డాడు.

కాని అంతలోనే బస్సు రావడాన "లేవండి లేవండి. వచ్చేసింది మన రథం" అని రథంలాంటి ఆయనకు చేయి అందించాను.

కింద కూర్చున్న వాడిని లేపేందుకే నేను కావలసి వచ్చినప్పుడు ఈయనతో పెట్టుకుంటే, ఇక నేను బస్సు ఎక్కినట్టేనన్న విషయం గ్రహించి, ఆయన్ని ఆగమని నేను గుంపులోకి దూసుకుపోయి, మొత్తా నికి లోపలికి జొరబడి ఆయనకి నాకు కూడా స్థలం సంపాయించగలిగాను. అయితే ఆయన లోపలికివచ్చి నన్ను కిటికీ వైపునుంచి లేపి తను అటు కూర్చో వడం మాత్రం నాకు నవ్వు తెప్పించింది. మధ్యన నడిచేవారు తనకి తగలకుండా నన్న మాట ఈ జాగ్రత్త! "దారిలో నేను దిగిపోయాక ఏం చేస్తాడో మానవుడు!" అనిపించింది.

చేసిన తప్పు దిద్దుకుంటున్న దానిలా బస్సు వేగంగా పోతోంది. ఉమాపతిగారు ధారాళంగా ఉపన్యసిస్తున్నాడు లోకం ఎలా భ్రష్టు అయి పోయిందీ, మడి ఆచారం ఎలా కలికానికి కూడా లేకుండా పోయిందీ సోదాహరణంగా చెబుతున్నాడు. పూర్వం ప్రతి ఊళ్లోనూ ఒక "మడి" హోటలుండేదిట! కొన్ని చోట్ల పట్టు బట్టలు వాళ్లే ఇచ్చే వారుట! అన్నీ చెప్పి తనలాటి వాడికి కదలవలసిన రోజులు కావన్నాడు.

అవునన్నాను.

ఇలా ఆయన చెప్పే మాటలు వింటూ బాధ పడుతున్న నాకు హఠాత్తుగా ఆయన వాక్ప్రవాహం ఆపేసి సంచిలోంచి ఏదో పుస్తకం తీసుకుని అందులో తల దూర్చేయడం ఎంతో హాయని పించింది. "బహుశ ఆయన మాటలు ఆయన్నే బోరుకొట్టి ఉంటాయి" అనుకుంటుండగానే బస్సు ఆగడం ఒకావిడ ఎక్కడం జరిగింది. వెంటనే మళ్ళీ బయలు దేరింది బస్సు.

కిటికీలోంచి బయటికి చూస్తున్నాను. బల మయిన కొత్త పార్టీలో చేరిపోయేందుకు సిద్ధంగా ఉన్న రాజకీయ నాయకుడిలాగా చీకట్లోకి జారు కుంటూన్న పగటి బలహీనతని గ్రహించి తమ్ము తాము రక్షించుకునేందుకు హడావుడిగా పరుగులు తీస్తున్నాయి పక్షులు.

"చిల్లర లేకపోతే దిగిపొండి. నా దగ్గిరలేదు" అంటున్నాడు కండక్టర్ ఖచ్చితంగా.

ఏమిటా అని లోపలికి చూశాను.

కొత్తగా ఎక్కిన ఆవిడ దగ్గర నిలబడి ఉన్నాడు కండక్టర్. ఆవిడచేతిలో పదిరూపాయల నోటుంది.

"లేదు. ఉంటే ఇచ్చేదాన్నిగా! చూడండి!" అంటోంది ఆవిడ మెల్లగా—పది రూపాయల నోటున్నా డబ్బు లేని దాని పరిస్థితిలో.

"నేను మాత్రం ఉంటే ఇవ్వనా— అలా మాటా డతారేం? ప్రతివాళ్ళు అయిదులూ, పదులూ ఇస్తే మా దగ్గర మట్టుకు ఎక్కడినుంచి వస్తుంది?.... ఎవరి దగ్గరయినా ఉందేమో అడగండి పోనీ" అని వెనక్కి తిరిగి అందరివంక చూశాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. ఉమాపతి మాత్రం ఏకదీక్షతో చదివేస్తున్నాడు. ఇంత హడావుడి పడుతుంటే ఈయన కనీసం తల ఎత్తడేం అని ఆశ్చర్యం వేసింది నాకు.

"చూశారా—లేదు. అయినా నలభయి పైసల టిక్కట్టుకోసం పదులు ఇరవైలూ తెస్తే ఎలా గండి? పోనీ చివరిదాకా వస్తారా అంటే అదీ లేదు......లాభంలేదు దిగిపొండి!" అని ఈలేశాడు.

బస్సు వేగం తగ్గుతోంది.

పాపం ఆవిడ అందరివంకా చూసింది. ఒక్క సారి బయటకు చూసింది. చీకటి పడిపోయింది. నాకు జాలేసింది.

"పోనీ ఎక్కినచోటయినా కాదు—ఆవిడ్ని దిగ మంటే ఎలా దిగుతుందయ్యా?" అన్నాను కలగ జేసుకుని.

"నాకుమాత్రం సరదాటండీ! బస్సు నాదయితే "ఊరికేనే తీసుకుపోదును మీ అందరినీ!...... అంతగా లేకపోతే ఎవరైనా సర్దరాదూ!


నేను జేబులు వెతికాను. మూడు పది పైసల బిళ్ళలు కనబడ్డాయి. ఒక్క క్షణంచూసి ఉమా పతిని తట్టి "మీ దగ్గర పది పైసలుంటే ఇవ్వండి" అన్నాను.

అతనొకసారి నా వంక, ఒకసారి ఆమెవంక చూసి "నా దగ్గర లేవు. ఉన్నా ఇవ్వను. ఇచ్చినా పుచ్చుకోరు!" అనేసి మళ్ళీ పుస్తకంలోకి దూరి పోయాడు.

నాకు చాలా ఆశ్చర్యంవేసి ఆమె వంక చూశాను. ఆమె నా చూపులు తప్పించుకుంటు బయటకు చూడసాగింది. ఇందులోని చిత్రం నా కర్థం కాలేదు.

"నా దగ్గర ముప్ఫయి పైసలున్నాయి" అన్నాను జనాంతికంగా. కండక్టరు వచ్చి అందుకున్నాడు.

మరెవరో ఒక పది ఇవ్వబోతే ఆమె "నా దగ్గర



పది ఉందిలెండి" అని అందించి "మీరెక్కడిదాకా వెడతారు?" అనడిగింది మెల్లిగా.

"మీ ఊరే!" అన్నాడు కండక్టరు.

ఎందుకో నాకు సిగ్గనిపించింది. ఇంతమందిలో పెద్ద మొనగాడిలా నేనే డబ్బెందుకు ఇవ్వాలి?...... అంతలో హటాత్తుగా ఉమాపతిలోని వింత ప్రవర్తన గుర్తుకొచ్చింది.

"పది పైసలు ఇవ్వమంటే ఎందుకలా మాట్లాడాడు? లేకపోతే లేదని చెప్పచ్చుగా! ఆవిడ కూడా అతనివంక చూసిన విధం లోగడ బాగా పరిచయం ఉన్నట్టుగా ఉంది" అని అనుకుంటుంటే ఉమాపతి మాటలు ఆపేసి పుస్తకంలోకి తలదూర్చేయడం గుర్తు కొచ్చింది. "పాయింటే! బహుశ రోడ్డుమీద ఆవిడని చూసి అలా వేసి ఉంటాడు"

మరొక్కసారి వీళ్ళిద్దరివంక చూశాను. ఆవిడ మాత్రం మధ్య మధ్య అతనివంక చూస్తోంది. ఉమాపతి పుస్తకంలోని అక్షరాలను లెక్క పెట్టేస్తున్నాడు.

అడుగుదామనిపించింది. "ఆవిడ్ని ఎరుగుదురా" అని. కాని సభ్యత అడ్డు వచ్చింది.

కుతూహలంకొద్దీ ఆమెని పరీక్షగా చూశాను. షుమారు ముప్పయి ప్రాంతాల ఉంటుంది. అందమయిన మనిషి. అయితే కష్టపడడంవలన ఎండ దెబ్బ కొట్టిన దానిలా వడలిపోయింది. చేతికి రెండేసి బంగారపు గాజులు, రెండు మామూలు గాజులు, మెడలో ఒక గొలుసు—మొత్తంమీద ఆకృతి, అలంకరణ కూడా సంస్కారం ఉన్న దానిలా ఉన్నాయి.

నేను దిగవలసిన ఊరు రాగానే గబుక్కున బస్సు దిగిపోయింది ఆవిడ.

ఎవరికయినా ఏదయినా సాయం చేస్తే వారు కృతజ్ఞతలు చెప్పుకుంటుంటే మనం చాలా ఇరుకున పడిపోతాము—అబ్బె ఇందులో ఏముందండి—

# ఆంతర్యం

అంటూ. కాని అది మన అంతరాంతరాల్లో తృప్తిని కలిగిస్తుంది. వారలా చెప్పకపోతే బాధ పడడం సహజం.

అందుకనే నేను కూడా "వింత మనిషిలా ఉందే" అనుకుంటూ దిగి కిళ్ళీ కొట్టు దగ్గర నిలబడి ఆవిడనే గమనిస్తున్నాను.

నేరుగా పళ్ళ దుకాణంకి వెళ్ళి అక్కడ పళ్ళు కొనుక్కుని సంచీలో వేసుకుని గబగబ మళ్ళీ బస్సు దగ్గరకు వచ్చి చుట్టూ నాకోసం చూస్తోంది.

నా తొందరపాటుకి సిగ్గుపడి నేను రోడ్డెక్కాను. కాని ఆమె, ఉమాపతి మాత్రం నా మనస్సులో మెదులుతూ ఉన్నారు.

చేపలు నీళ్ళలో మునిగి ఉండి ఊపిరి పీల్చగలవు. అదే వాటి లోకం కూడా! అయితే మధ్య మధ్య నీటిపైకి వచ్చి సూర్యరశ్మిని అనుభవించి మళ్ళీ లోనికి పోతుంటాయి. తిరిగి పైకి వచ్చేదాకా మళ్ళీ వాటి లోకం అదే!

జీవితపు గాడిలో పడిపోయిన నాలాటి వాడికి కష్టమే అయినప్పటికీ అటువంటి సమావేశాలు, వివాహాలే ఆట విడుపులు—ఏదో పోగు జేసుకున్నది ఏమయినా ఉంటే సరదాగా ఖర్చు పెట్టుకునేందుకు నలుగురిలో తిరిగేందుకు. తిరిగి యధాప్రకారం జీవనం. ఉదయం సాయంత్రం నలుగురికి తోచిన నాలుగు ముక్కలు చెవిన వేయడం, పదినుంచి అయిదింటిదాకా బడిలో రంగస్థలంమీది నటుడిలా వాగడం ప్రారంభమవుతుంది.

ఇంతకీ నే చెప్పవచ్చేది ఆ సంఘటన మరిచిపోయానని కాదు—మరుగున పడిపోయిందని దానికి అనుబంధంగా మరొకటి జరగకపోతే మరుపున పడిపోయేది. అలాగే జరిగి ఉంటే ఈ కథ చెప్పవలసి వచ్చేదీ, ఆ అవసరమన్నది జరిగేది ఉండేదికాదు.

ఒకరోజు బస్టాండ్‌కేసి వెళ్ళాను. మా బావమరిది వస్తానంటే ఆయనకి దిగే వ్యవధానం లేదుట, ఏవో రెండు విషయాలు చెప్పవలసినవి ఉన్నాయి బస్ దగ్గరకు రమ్మనమని రాశాడు. ఈ బావ మరుదులు అన్న జనాభా రాజ బంధువుల కోవకి చెందినవారు. మన మనస్సుకి కష్టంగా ఉన్నా, వారిని చిరునవ్వులతో పలకరించాలి, ఎక్కడికి రమ్మంటే అక్కడ వారిని కలుసుకోవాలి. అలా జరగనినాడు ఇంట్లో పుట్టగతులుండవు!

వారికోసమని స్టాండింగులో రేకుల షెడ్డుకింద నిలబడి ఉన్నాను. వచ్చే బస్సు వస్తోంది. వెళ్ళేది వెడుతోంది. కాని ఆయనగారు మాత్రం ఫికరు లేదు. మరొకటి అనుకుంటూ నేను అలాగే నిలబడిపోయాను.

అప్పుడే వచ్చిన ఒక బస్సులోంచి నాపేరు వినబడేసరికి చటుక్కున అటు తిరిగాను ఆశగా. కాని తీరా చూస్తే మావాడు కాదు—మోహనమూర్తి.

మోహనమూర్తి, నేను డిగ్రీ క్లాసులో సహాధ్యాయులం. పెద్దలు సంపాయించినది రెండు చేతులకు సరిపడ ఉండగా, మనం వేరే కష్టపడడమెందుకని పరీక్షకి కూర్చోకుండానే ఇంటికి చేరుకున్నవాడు ఇతను. చదువుకునే రోజుల్లోని ఇతని ప్రవర్తనమీద రక రకాల వ్యాఖ్యానాలు ఉండేవి. అవి నిజమన్న నమ్మకమూ ఉండేది. మనిషి మాత్రం బావుంటాడు మేడి పండులా!

దగ్గరగా వెళ్ళి "ఏమోయ్ బాగున్నావా?" అనడిగాను.

"మన బాగుకేం లోటు బ్రదర్! మనకు కావలసినవి డబ్బుకు దొరుకుతూ, కావలసినవి సంపాయించుకునేపాటి డబ్బూ ఉన్నప్పుడు!" అని తన తెలివికి తనే ఫెళ్ళున నవ్వాడు.

ఒక్క క్షణంపాటు ఆ "కావలసిన వేమిటో" పూర్తిగా అర్థం కాలేదు. అంతలోనే గ్రహించుకున్నాను. మనిషిని చూస్తే అసహ్యం వేసింది.

"బస్సు బయలుదేర బోతున్నట్లుంది. ఎక్కితే మంచిది" అన్నాను హెచ్చరిస్తున్నట్లుగా.

కాని అతను నా ఊసు పట్టించుకోవడం లేదు. దృష్టి ఎటో ఉంది. అతను చూస్తున్న వైపుగా చూపు పోనిచ్చాను.

బస్సులో కనబడిన ఆవిడ అగపడింది. అతని వైపు చూస్తున్నదల్లా నేను కూడా తన వైపు చూడడంతో ఖంగారుపడి గబగబ బస్టాండుకి అడ్డుపడి వెళ్ళిపోయింది.

ఇటు తిరిగేసరికి మోహనమూర్తి బస్సు ఎక్కి కూర్చుని "మొత్తానికి భలే భలే వాళ్ళని చేరదిస్తుందోయ్ మీ ఊరు!" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

కష్టంవేసింది నాకా మాటకి. అయినా మామూలుగానే "ఎరుగున్నావా ఆమెని?" అనడిగాను.

"బ్రహ్మాండంగా!"

"ఏమన్నా అవుతుందా నీకు?"


"ఇప్పుడేమీ కాదు!"

"ఒకప్పుడు?" ఆత్రంగా ప్రశ్న వేశాను.

అతను చెప్పేలోపలనే బస్సు బయల్దేరింది.

"మరోసారి వచ్చినప్పుడు......లేకపోతే ఆడగరాదూ చెబుతుంది!" అని నవ్వాడు.

అచేతనంగా నిలబడిపోయాను.




"అయ్యా! మీరింతవరకు 'కుటుంబ నియంత్రణం' చక్కగా అమలు పర్చారు. సంతోషం, మీరిక ఇద్దరు పిల్లల్ని కనవచ్చు సార్!"

ఆలోచనలు చీకట్లలాగా ముసురుకుంటు న్నాయి. ఆమె ఎవరు—ఉమాపతి ఆమెను ఎరు గున్నాడు. ఎలా? మోహనమూర్తికి బాగా పరి చయం ఉంది ఆమెతో—ఏవిధంగా?...... కొంపదీసి ఆమె ఒక—

...కాని ఆ ఆలోచనని అక్కడితో అణిచి వేశాను. ఆమెను గురించి చెడుగా ఆలోచించేం దుకు మనసొప్పలేదు.

వచ్చినపని మాత్రం పూర్తి కాలేదు. మా రాజ బంధువు రాలేదు. బజారులో కాసేపు ఊరేగి ఇంటికి చేరుకున్నాను. వెళ్ళగానే మా ఆవిడ చెప్పింది, "మీ కోసం ఎవరో వచ్చారు" అని.

"ఎక్కడున్నారుట?" అన్నాను.

"వంటింట్లో—పిలవనా?"

"అయితే నేరుగా ఇంటికే వేంచేశాడన్నమాట!"

"మా వాళ్ళేం వంటింట్లో చేరరు. ఆ బుద్ధి మీ వాళ్ళకే—నామీద పరీక్షకి!......పిలుస్తా నుం డండి" అని వెళ్ళబోయింది.

"జడని బాగానే ఊపుతున్నావుగాని ఊడి వచ్చేను సవరం!" అన్నాను నవ్వుతూ.

"మీ విగ్గుకన్న నయమేలెండి!" అంది వెక్కి రింపుగా.

"పతి దేముడ్ని అంతలేసి మాట లనచ్చుటే— నాది విగ్గా?"

"మరి నాది సవరమా—ఉట్టి ఈర్ష్య!"

లోపలనుంచి మా ఇందిరతో వచ్చిన ఆవిడని చూసి ఆశ్చర్యపోయాను. నా మనస్సులోని ప్రశ్న లకి సమాధానంలా నుంచునుంది నా ఎదట.

"ఆయనే మా ఇంటాయన, ఇల్లుగలాయ నాను" అని నవ్వి, "రాజేశ్వరి ఈవిడ పేరు. నాకు కాబోయే మాస్టరుగారు" అని పరిచయాలు చేసింది ఇందిర.

నేను ప్రశ్నార్థకంగా ఆమె వైపు చూశాను.

"ఇందిరగారు మా స్కూల్లో కుట్లు నేర్చు కుంటారుట!......మా అబ్బాయి మీ దగ్గర స్టూడెంటు" అని, తరువాత "నమస్కారం" అంది.

నేను కూడా నమస్కారం పెట్టి, "ఇందూ కాస కాఫీ......" అంటూంటే మధ్యలోనే అందు కుని, "మా వప్పుడే అయాయిలెండి. మీ కోసం ఉంచాను" అని లోపలికి వెళ్ళింది ఇందిర.

నేను ఏంచేయాలో తెలీయక "కూర్చోండి" అన్నాను.

కింద చాపమీద కూర్చుంటూ, "నన్ను గురించి నేను కొంత చెప్పుకోకపోతే మీరు నన్ను అపార్థం చేసు కునే ప్రమాదం ఉందని వచ్చాను మాస్టరు గారూ" అంది.

నేనేమీ మాట్లాడలేదు.

"నాకు ఒకప్పుడు ముఖ్యులయిన ఇద్దరితో మీకు పరిచయం ఉండడంవలన నేను మీకు నా కథ చెప్పక తప్పదు. మీరు వినక తప్పదు"

నేను నవ్వుతూ, "సభ్యత అడ్డు వచ్చింది కానీండి, మీరు కనబడగానే అడుగుదామనుకున్న మొదటి రెండు ప్రశ్నలూ అవే!" అన్నాను.

రాజేశ్వరి తలవంచుకుని, "ఉమాపతి మా అన్నయ్య. ఇక రెండవాయన మా ఆయన" అంది.

ఆశ్చర్యపోయాను.

ఇందిర నాకు కాఫీ అందించి, చాపమీద గోడ నానుకుని కూర్చుంది.

40 వ పేజీ చూడండి





త్వరితంగా భుజించుట లేదా పుష్టికరమైన ఆహారమును అమితంగా భుజించుటవల్ల కడుపు ఉబ్బరం కలుగుతుంది. చాలా కాలంవరకు బాధించకుండా వుండే శీఘ్ర నివారణ కోసం, తక్షణం—సడలించే ఈనో 'ఫ్రూట్ సాల్ట్' సేవించండి! ఈనో యొక్క అసమాన అమ్ల-నిరోధక చర్య మీ కడుపులోని వాయువును త్వరలో సరితూకంగా చక్కబరచి మీ జీర్ణప్రకృతిని కుదురు పరచును. ఈనో మిమ్ములను యథాస్థితిలో ఆరోగ్యంగా వుంచుతుంది.




E/1/P/2/63 TL. R

"చెల్లెలి మొగుడితో లేచిపోయింది" అని నామీద అపవాదులు వేశారు.

మా అన్నయ్య కూడా ఎరుగున్న వాళ్ళతో అన్నాడుట ఆ మాటే! బంధువులతో "నాకూ, దానికీ సంబంధంలేదు" అన్నాడు.

అసలాయన ఈ ప్రకటన చేసేందుకు ఇటువంటి అవకాశం కోసరమే ఎదురు చూస్తున్నాడనుకుంటా!

నాకు మాత్రం పూర్తి చేయూతనిచ్చి, నాకు ఒక మార్గం చూపించింది మా పద్మ. గోపాలరావు గారూను. ఆయన కంపెనీలోనే కుట్లు నేర్పేందుకు నన్ను వేయించాడు. దానికి తోడుగా పదిమంది పిల్లల్ని ప్రయివేట్లకి కుదిర్చాడు.

ఆయనకీ ఊళ్ళో మంచి పలుకుబడి ఉంది. వాళ్ళిద్దరి నీడనా నా జీవితం సుఖంగా వెళ్ళిపోతోంది!"

ఆవిడ ఆఘగానే "మరి కొడుకుకోసం మోహనమూర్తి ప్రయత్నించలేదూ?" అనడిగాను.

"చెయ్యకుండా ఉంటారా? చివరికి దౌర్జన్యంగా తీసుకుపోదామని ప్రయత్నించారు. అప్పుడు కూడా నాకు అండగా నిలిచింది మా పద్మ మొగుడే. దౌర్జన్యానికి దిగితే ఈ ఊరినుంచి మరి బయటకు పోలేరు! అన్నాడు. "మీ కొడుకుకోసం మీరు ప్రయత్నించేటట్లయితే మేం కూడా మనోవృత్తికోసం ప్రయత్నిస్తాం! ఇష్టం ఉంటే ఆవిడతోపాటు సుఖంగా వేరే కాపురం పెట్టుకోండి" అని కబురు చేశాడు.

దాంతో మళ్ళీ ఆ గోల లేదు. కాకపోతే—అతనితో లేచిపోయానని, అతని దగ్గరనే ఉంటున్నానని—ఇలా ఇష్టం వచ్చినట్లు నా మీద ప్రచారం చేశారు. ఇప్పుడదీ పాతపడిపోయింది!

మా అన్నయ్య అవన్నీ నమ్ముతాడు. అందుకే నాతో మాట్లాడడు" అని కాసేపాగి, "ఇప్పుడు నా ఆశలన్నీ మా మధుసూధనంమీద. వాడు తెలివిగలవాడు. వాడిని ప్రయోజకుడ్ని చేయగలిగితే, నేపడిన కష్టాలు, మోసిన అపనిందలు అన్నీ మరిచిపోగలను. కావాలంటే ఇంకా భరించగలను కూడా!" తలవంచుకుని కళ్ళద్దుకుంది పమిట చెరుగుతో.

మా ఆవిడ వైపు చూశాను—అప్పుడే అద్దేసుకుని తలెత్తి నన్ను చూసి సిగ్గుపడింది.

"మిమ్మల్ని విసిగించాను. కేవలం నన్ను గురించి మీకున్న అపార్థాలు తొలగించాలని పనిగట్టుకు వచ్చాను" అని లేవబోయింది రాజేశ్వరి.

మా ఇందిర గబుక్కున ఆవిడ్ని ఆపి "ఈ పూట ఇక్కడే భోజనంచేసిపోవాలి అక్కయ్యగారూ, నా మాట కాదనద్దు" అని బలవంతం చేసేసింది.

"చూశారా, మధ్య నేను పరాయి వాడినయ్యాను. చెల్లెలిమాట కాదనకండి—ఏడుస్తూ కూర్చుంటుంది."

"ఆ సంగతి మే మిద్దరం చూసుకుంటాం—మీరు చెప్పక్కర్లా" అంది ఇందిర బుంగమూతి పెట్టి.

"ఇంతకీ అబ్బా యెక్కడ?"

"నన్ను తీసుకెళ్ళేందుకు మళ్ళీ వస్తాడు..... అదుగో మాటలోనే వచ్చేశాడు."

వాడు వస్తూనే నమస్కారం పెట్టాడు నాకు.

నాకు ఆశ్చర్యం వేసింది. "నువ్వటయ్యి, నాకు తెలియనే తెలియదు సుమీ—అన్నట్టు తెలిసే అవకాశం మాత్రం ఎక్కడుంది, పరిచయమైంది. ఇప్పుడేగా! రాజేశ్వరమ్మగారూ, వీడు ఎదుట వాడిని మెచ్చుకోవడం మంచిదికాదు. నువ్వు కాస్త చెవులు మూసుకోవోయ్ మధుసూధనం! మీ వాడు చాలా తెలివైనవాడండీ! బుద్ధిమంతుడు కూడా! నాకు ఇన్నాళ్ళుగా కలిగిన అభిప్రాయం అది" అన్నాను నవ్వుతూ. అబ్బాయి నా క్లాసు విద్యార్థే!

ఆవిడ ముఖంలో కనబడిన సంతృప్తి అపూర్వం!

ఆనాడు మొదలు మధుసూధనం ఇంటిదగ్గర కూడా నా దగ్గర చదువు చెప్పించుకునేవాడు. ఆవిడ పడిన కష్టానికి వీడు పైకి రావాలి. అందుకు నేను కూడా నా శక్తి వంచన లేకుండా కృషి చేయదలుచుకున్నాను. అది కూడా పెద్ద శ్రమయిన పనికాదు. అతను చాలా తెలివిగలవాడు. అతల్లిలాగానే తను రైటనుకున్నది. ఎన్ని అడ్డంకులు వచ్చినా చేసేశేవాడు. కాకపోతే మనం చేయువలసినదల్లా చెడుని రైటని వాడు నమ్మకుండా చూడడమే!

ఆ ఏడు స్కూలు ఫస్టుగా వచ్చాడు మధుసూధనం!

మొదట మాత్రం తను వాడి కాలేజి చదువు భరించగలనా అని భయపడింది రాజేశ్వరి. కాని వాడి మార్కులకి స్కాలర్‌షిప్పు వస్తుందని ధైర్యం చెప్పి, కాలేజీలో చేర్పించాం. నేనూ, గోపాలరావు గారు.

అప్పుడు కూడా ప్రతి రోజూ నా దగ్గర కూర్చుని తెలియనివి చెప్పించుకునేవాడు. వాడి కృషి అనండి, నా గైడన్సు అనండి, వాళ్ళమ్మ అదృష్టం అనండి వాడు యూనివర్శిటీ రాంక్‌తో పాసయ్యాడు.

వాడి నెలాగయినా 'డాక్టర్' చేయాలని రాజేశ్వరి ప్రయత్నం కాని ఈసారి నేనూ, గోపాలరావుగారు కూడా అధైర్యపడ్డాం. "అన్ని సంవత్సరాలపాటు ఈవిడ ఈ శ్రమకి తట్టుకోగలదా?" అని.

అయితే ఇప్పుడు ధైర్యంగా నిలబడింది రాజేశ్వరే!

"నా అదృష్టం పరీక్షకి వచ్చినప్పుడు వెనకంజ [illegible] నా శరీరంలో శక్తి ఉన్నంతవరకూ—భరించగలను. అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు......అంతగా మరీ నా తాహతుకి మించిపోతే మంచి కుటుంబం లోని పిల్లని చూసి వీడికి పెళ్ళి చేస్తేసరి ఆ మావ గారు సహాయం చేస్తాడు. వెనకాడకండి—మీరూ, మా మరిదిగారు కలిసి వాడిని మెడిసన్‌లో చేర్పించాలి" అంది మా ఇంటికి వచ్చి.

ఒక దైవ కార్యంలో పాల్గొంటున్న వాడిలా నాకూ ఎక్కడలేని ఉత్సాహం, నా పిల్లాడిని చేర్పిస్తున్నంత సంతోషం కలిగాయి.

గోపాలరావుగార్ని వెంటనిచ్చి విశాఖపట్టణం పంపాం మధుసూధనాన్ని!

ఆయన తిరిగివచ్చి వాడు చేరిన వైనం, స్కాలర్‌షిప్ వివరాలు చెబుతుంటే అందరం కలిసి ఆనందంగా విన్నాం. హాస్టల్లో భోజనం బాగుండదని విన్నప్పుడు రాజేశ్వరమ్మ ఏడవసాగింది. అప్పుడు మా ఇందిర, పద్మావతి కలిసి ఆమెను ఓదార్చారు.


జీవితం ఇక్కడిదాకా ఆవిడ అనుకున్నట్లుగానే సాగిపోయిందని అందరం సంతృప్తి చెందాం!

తెలుగువాడికి ఒక జబ్బుంది అని ఈమధ్య నేనేదో పత్రికలో చదివాను. అది ఏమిటంటే ఎవరయినా పైకి వచ్చే దాకా వారెవరో పట్టించుకోనివారు వాడికి పేరు-రాగానే వీడు మన తెలుగు వాడేనన్న విషయం ప్రకటిస్తారుట!......తమిళ సోదరులు బ్రహ్మరథం పట్టేదాకా త్యాగయ్య మనవాడన్న విషయం పోల్చుకోలేక పోయారుట!

మధుసూధనం కాలేజీలో చేరిన ఆరు నెలలకి ఒక రోజున రాజేశ్వరి మా ఇంటికి వచ్చింది. ముఖవైఖరి చూసి "ఏమండీ అలాగున్నారు?" అనడిగాను.

"మన మధుసూధనం దగ్గరకు మాఅన్నయ్య వెళ్ళాడుట!" అంది గంభీరంగా. అని అంతలోనే నవ్వుతూ, "మా అన్నయ్య ఏదో పనుండి విశాఖపట్టణం వెళ్ళాడుట. అక్కడనుంచి వెతుక్కుంటూ హాస్టల్‌కి వెళ్ళి మేనల్లుడిని పలకరించాడుట."

"మావయ్య చాలా ఆత్మీయంగా మాట్లాడాడు. ఇంత ప్రేమ గలవారితో మనకు మాటలు ఎందుకు లేవా అని ఆశ్చర్యం వేసింది" అని రాశాడు అంది.



నేను క్షణంపాటు మాట్లాడలేకపోయాను. ఎందుకంటే ఇది ఆవిడకి ఆనందం కలిగించే వార్తో నాకు తెలియదు. అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చి—

"ఇన్నాళ్ళూ మీరు అక్కరలేని వాడికి మీ కొడుకు బంధువయ్యాడన్నమాట.......కూతుళ్ళు ఉన్నారా?" అనడిగాను.

"ముగ్గురున్నారు. ఈసారి మధు వచ్చినప్పుడు.... ఏమోలెండి. ఊరికినే అకస్మాత్తుగా వచ్చి ఉండవచ్చును ఆయన" అంది మధ్యలోనే చెప్పవలసినదేదో ఆపుతున్నట్లుగా.

"మధుసూధనంతో చెప్పాలని ఉంది—చెరువు నిండితే కప్పలు చేరతాయని, ప్రయోజకుడయితే బంధువులు దగ్గరవుతారని."

ఒక్క నిముషం ఆగి, "మీ ఇష్టం!" అని లేచి వెళ్ళిపోయింది.

శలవలకి వచ్చినప్పుడు మధుసూదనం మా ఇంటికి వచ్చాడు—చక్కటి బట్టలతో దర్జాగా ఉన్నాడు!

"బాగున్నావా?" అనడిగాను.

"మామయ్యగారింటికి వెళ్ళి వస్తున్నానండి మాస్టారూ, ఇంటిల్లిపాది ఎంతో మర్యాద చేసేశారు......ఆయన మరీ మరీ రాశాడు రమ్మనమని. సరే కదా అని దిగి రెండు రోజులు ఉండి వస్తున్నాను. పాపం ఏవో బట్టలు పెట్టాడు" అన్నాడు తన వంక చూసుకుంటూ.

సమయం ఆసన్నమయిందని "చూడు మధుసూధనం, ఇన్నాళ్ళుగా మీ అమ్మని 'బ్రతికున్నావా?' అని అడిగిన పాపాన పోలేదు మీ మామయ్య! ఇప్పుడు నువ్వు ప్రయోజకుడివి కాబోతున్నావని పసిగట్టి నిన్ను దగ్గర చేసుకుంటున్నాడు. నువ్వు చదువుకుంటూ నాకన్న పైకి వెడుతున్న వాడివి. అయినా చెబుతున్నాను. ఒక్క విషయం ఆలోచించు—ఇప్పుడు ఎన్ని చేసినా మావయ్య మీ అమ్మకి చేసిన అన్యాయం సవరించగలడా?...... అయినా అంతగా మీతో కలవాలని ఉంటే ఆమె ద్వారానే చేయచ్చుగా ఆపని!" అన్నాను.

అతను కాసేపు మాట్లాడలేదు. నా మాటలు పని చేశాయని ఆనందపడ్డాను. అంతలోనే హటాత్తుగా అడిగాడు.

"మా అమ్మ చేసిన పని మంచిదేనని నమ్ముతున్నారా మాస్టరుగారూ?" అని.

ఆశ్చర్యపోయాను.

"అదేమిటి మధుసూధనం—ఆత్మాభిమానం గలది. చదువు, సంస్కారం ఉన్నది చేయవలసిన పని చేసింది అమ్మ. నేను పూర్తిగా సమర్థిస్తాను ఆవిడ చర్యని" అన్నాను.

లేచి—కాసేపు నిలబడి—"వెళ్ళొస్తాను మాస్టారూ" అని నమస్కరించి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపు చూస్తూ ఉండిపోయాను. అతని ప్రశ్న అతనికే వేసేందుకు భయం వేసింది నాకు. సమాధానం ఏం చెబుతాడోనని!

మొత్తానికి మునుపటి మధుసూధనం కాదు! మారాడు!

శలవుల్లో లోగడంత ఆత్మీయతతో మాట్లాడలేకపోయాను అతనితో. అది నా లోపమే కావచ్చు. లేక నాకు రాజేశ్వరిపైన గల అభిమానం, గౌరవం

# ఆంతర్యం

వలన కావచ్చు. మొత్తానికి నా కతను కొత్తగా కనబడసాగాడు.

శలవలు ఇంకా ఉన్నాయనగానే బయలుదేరాడు మధుసూనం గోపాలరావు ఊళ్లో లేడు. నేనూ, రాజేశ్వరమ్మా స్టేషనుకి వెళ్ళాం సాగనంపేందుకు.

ఏమనాలో తెలియక "ముందుగా బయల్దేరావేం మధుసూధనం?" అనడిగాను.

"వెళ్ళేప్పుడు వస్తానని మావయ్యతో చెప్పాను మాస్టారూ, అక్కడ రెండు రోజులుండి పోదామని!"

రాజేశ్వరివంక చూడలేకపోయాను. ఆ ప్రస్తావన తెచ్చినందుకు బాధ పడ్డాను.

"మామయ్యని, అత్తయ్యని అడిగానని చెప్పబ్బాయ్" అంది రాజేశ్వరి.

ఆమె వంక చూశాను. తదేకంగా వెలుగుతూన్న సిగ్నల్ లైట్‌ని చూస్తోంది.

అక్కడ పచ్చ లైటు పడింది అప్పుడే!

వెళ్ళిన వారానికి మధుసూధనం దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందిట. "మామయ్య వంద రూపాయలు బట్టలు కుట్టించుకోమని ఇచ్చాడు. కాబట్టి

"ఛా, వెధవబ్లేడు, వెధవబ్లేడు! దీంతో గొంతుకూడా తెగేట్లు లేదు!" ఓ భర్తగారి విసుగు.

"ఆ దేమిటండీ మరీ చోద్యం, నిన్న నేను చెక్కుకున్న పెన్సిలు కన్న బిరుసా మీ గెడ్డం," అమాయకపు భార్య సమాధానం.

శివరాం (చిలకలూరిపేట)

నువ్వు పై నెల డబ్బు పంప వవసరం లేదు" అని రాజేశ్వరి నాకీ ఉత్తరం చూపించి, "నా మీంచి కొంత భారం తీసేశాడు. మాస్టరుగారూ మా అన్నయ్య, ఇక నేను నిశ్చింతగా ఉండచ్చు" అంది.

ఆమె మాటల వెనకనున్న తాత్పర్యానికి ప్రయత్నించి విఫలుడ నయాను.

సంక్రాంతి శలవలకి ముందు నా పేరట ఉత్తరం ఒకటి రాశాడు మధునూదనం. "మాస్టారూ, మనకు అనుభవం కలుగుతేగాని ఏ విషయం నమ్మకూడదని' మీరు చెబుతుండేవారు ఎంతో ముందు చూపుతో చెప్పిన మాటలండీ అవి!

మొన్న మావయ్య ఒకాయన్ని వెంటబెట్టుకు వచ్చాడు. ఆయన మంచి స్ఫురద్రూపి. చూడగానే ఆకర్షణ కలిగింది ఆయన పట్ల. ఇంతా చేస్తే ఎవరో తెలుసా ఆయన—మా నాన్నగారుట!

మొదట నా కాయనతో సరిగా మాట్లాడ బుద్ధి కాలేదు. కాని ఆయన ప్రేమ, అప్యాయత నన్ను ముగ్ధుడ్ని చేసేశాయి. నన్ను క్షణం వదలలేక పోయారాయన......ముగ్గురం కలిసి విశాఖపట్టణం అంతా ఏలేశాం రెండు రోజులపాటు.....

తండ్రి ప్రేమని ఈజీవితంలో పొంద లేననుకున్నాను. కాని అదృష్టవంతుడ్ని......వెడుతూ వెడుతూ నా చేతికి నాలుగు వందల రూపాయలు ఇచ్చారు మా నాన్నగారు. అమ్మకి చెప్పండి—ఇప్పుడూ డబ్బుకి అవసరం లేదని. బహుశ శలవలకి 'మా ఊరు' వెళ్ళి తరువాత వస్తాను" అని.

ఆ ఉత్తరంలోని సారాంశాన్ని ఆవిడకి ఏవిధంగా అందజేయాలో తెలియలేదు నాకు. చెప్పడం కన్న ఆవిడకే ఈయడం మంచిదనిపించింది. ఇంటికి వెళ్ళాను.

చదువుకుని తేలిగ్గా నవ్వేసి, "ఇంకా కొంత బాధ్యత ఉందనుకున్నాను. అది ఈయన తీసేసుకున్నారండోయ్ మాస్టరుగారు—ఇంక నాకే చింతా లేదు. నిశ్చింత. అంతా నిశ్చింతే!" అంది రాజేశ్వరి.

అక్కడనే ఉన్న గోపాలరావుగారు మాత్రం చదివి మండిపడ్డాడు "ఈ వెధవకి బుద్ధి చెప్పాలండి మాస్టారూ. ఇప్పుడు నాయన వచ్చాట్ట, మొన్న మావ వచ్చాట్ట—రేపు మామయ్య కూతురు బాగుందంటాడు! అంట్ల వెధవ—కష్ట పడింది ఆవిడాను అనుభవం వీళ్ళపాలా? ఒక్క వెధవ ఆవిడని పలకరించిన పాపాన పోయాడా? పోనీ మెడిసిన్‌లో చేరేదాకా ఈ వెధవని పలకరించారా?...... రేపు రానీండి వాయించేస్తాను" అన్నాడు ఉద్రేకంగా.

రాజేశ్వరమ్మకోసం చూస్తే అక్కడలేదు. లోపలికి వెళ్ళి చెబుదామనుకున్నానుగాని చెప్పకుండానే గోపాలరావుతో బయటకు వచ్చేశాను.

ఆయన మాటలు విన్నాను. ఆవేశం చూశాను. కాని నా కనిపించింది ఒక్కటే—ఇక రాబోయే మార్పుల్ని చూస్తూ ఊరుకోవడం! చాతనయితే వాటితోపాటు సర్దుకుపోవడం తప్ప చేయగలిగిందేమీ లేదని.

మధుసూధనం జగన్నాధ రథం వంటివాడు. అది కదిలింది. ఇక ఆపడం కష్టం.

నా అయినా తప్పలేదు కూడా!

సంక్రాంతి శలవలన్నీ అయిపోతున్నాయనగా దిగబడ్డాడు మధుసూధనం ఆ సాయంత్రం నా దగ్గరకు వచ్చాడు.

"మాస్టారూ, ఒక మాట చెబుదామని వచ్చానండి" అన్నాడు సీరియస్‌గా.

"చెప్పు" అన్నాను నిర్లిప్తంగా.

"అయిన వారందరికీ దూరంగా ఇన్నాళ్ళూ పెరిగాను. ఒక్క తల్లి ప్రేమ తప్ప మరేదీ ఎరగని వాడిని. అటువంటిది నా వాళ్ళంతా నన్ను ఆదరిస్తుంటే వాళ్ళతో కలవడం తప్పంటారా" అనడిగాడు.

నేను మాట్లాడే లోపలే మళ్ళీ అందుకుని "నన్ను చిన్నతనంనుంచి ఎరుగున్నారు మీరు కూడా. నా మనస్సుకి నచ్చిన పనిని ఎవరెన్ని చెప్పినా ఆపనిని మీకూ తెలుసు....మా మావయ్య కూతురు రాధికని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను" అన్నాడు.

ఆశ్చర్య పడేందుకు నాకు కొంత టైమిచ్చాడు. కాని నే నటువంటి దేమీ చెయ్యకపోవడంతో అతనే విస్తుపోయాడు. "ఏం మాస్టారూ నేను చేస్తున్న పనిని విమర్శించరేం? మా గోపాలరావు బాబాయిలాగా తిట్టరేం నన్ను? మా అమ్మ

లాగా నిలుపునా ప్రశ్నలతో నింపరే?"

"చూడు మధుసూధనం, నువ్వు చదువులో నాకన్న పెద్దవాడి వవుతున్నావని ఇదివరకే చెప్పాను. నేను నీకు చెప్పవలసిందీ చెప్పాను......పైగా నువ్వే చెప్పావు కూడా—నీ విషయం పూర్తిగా తెలిసిన వాడినని"—

వా తరహాకి కొద్దిగా దెబ్బ తిన్నట్లున్నాడు—అయినా తన ధోరణిలోనే "మా రాధిక చాలా బావుంటుంది మాస్టారూ! అంతా మా అమ్మ పోలికేనుట మామయ్య అన్నాడు. నిజం కూడా అంతే......అయినవాడు, పైగా నాన్నగారికి ఈ సంబంధం చేసుకోవడం చాలా ఆనందం కలిగిస్తోంది. అమ్మకూడా ఒప్పుకుంది......"

ఇంకా ఏదో చెప్పబోతుండగానే "శుభం. చాలా మంచి పని చేస్తున్నావు మధుసూధనం. అయిన వాళ్ళనందరినీ దగ్గర చేసుకుంటున్నావు.....మరి వస్తాను కొద్దిగా పనుంది" అని లేచాను.

ఇద్దరం కలిసి బయటికి నడిచాం.

నాకయితే ఈ వార్త ఎంత బాధ కలిగించిందో చెప్పలేను. డాక్టరు చదువుతున్న కొడుకు సిద్ధంగా వస్తున్నాడు మోహనమూర్తికి. డాక్టరవబోతున్న అల్లుడు అతి చౌకగా దొరుకుతున్నాడు ఉమా పతికి. కాని పోతే ఈ డాక్టరు తయారయేందుకు తన రక్త మాంసాలని, సుఖాలని ధార పోసిన వ్యక్తికి లభ్యమవుతున్నది ఏమిటి? పోనీ ఈ విషయంలో వాళ్ళు నేరుగా వచ్చి ఆమెతో సంప్రదించారా? అదీ లేదు. ఆమె పూర్తిగా విస్మరించబడింది! ఎవరికోసం అయితే తన సర్వస్వాన్ని పణం పెట్టిందో అటువంటి కొడుకు చేత కూడా! ఇలా జరుగుతుందని ముందుగా తెలిసిఉంటే దాచుకున్న ప్రతి పైసా ఖర్చు పెట్టేదా? తన కడుపు మాడ్చుకుని వీడిని నవనవ లాడేట్లు చేసేదా?......

ఉద్రేకంతో వెళ్ళిపోతున్న నన్ను గోపాలరావు పిలుపు ఈ లోకంలోకి తెచ్చింది. అప్పుడు గమనించాను రాజేశ్వరమ్మ ఇంటిని దాటి వెళ్ళిపోతున్నానని!

లోపలికి అడుగు పెట్టగానే మంచంమీద నున్న రాజేశ్వరి అగపడింది.

రెండు రోజుల క్రితం చూసిన దానికి ఇప్పటికీ చాలా తేడా అగపడింది. రెండు రోజుల్లో మనుష్యులు ఇంతగా తగ్గిపోవడం నేనెక్కడా చూడ లేదు!......

"అక్కయ్యకి ఉదయంనుంచి జ్వరమండి" అంది పద్మావతి.

నేనేమీ మాట్లాడలేదు. నోరు తెరిస్తే మధుసూధనంని తిడుతూ, మాటలు వస్తాయని భయం. అవి ఆమెనేం బాధ పెడతాయోనని భయం.... రాజేశ్వరమ్మ మాత్రం మూసిన కన్ను తెరవకుండా పడి ఉంది. కాసేపు కూర్చుని లేవబోతుంటే "పెళ్ళి కబురు చెప్పాడా ప్రబుద్ధుడు?" అనడిగాడు గోపాలరావు.

"ఊఁ" అని మాత్రం అని గబుక్కున బయటపడ్డాను.

తొందర పనిమీద ఊరు వెళ్ళవలసి వచ్చిన నేను రెండు రోజులదాకా తిరిగి రాలేకపోయాను. వచ్చే రావడమే రాజేశ్వరమ్మకి సుస్తీ చాలాఎక్కువగా ఉందని తెలిస్తే వెళ్ళాను మా ఇందిరతో సహా. అయితే మేం వెళ్ళేసరికే అంతా అయిపోయింది.

[illegible] చెల్లెలుగా నాలోని జాలిని పంచుకున్న రాజేశ్వరి ఇక లేదనగానే నా గుండె బరువెక్కి







# ఆంతర్యం

పోయింది. ఇక అక్కడ నిలబడలేకపోయాను. మధుసూధనం మేనమామగారింటికి వెళ్ళడంవలన అతనికి కబురు తెలిసి, వచ్చేసరికి కొంతసేపు పడుతుందని నేను ఇంటికి బయలుదేరాను.

ఈ రెండు రోజులో ఎప్పుడో వచ్చిన ఉత్తరం ఒకటి నా కోసం ఎదురు చూస్తోంది. తీసి చూశాను. రాజేశ్వరి రాసినది. ఆత్రంగా చదివాను.

"అన్నయ్యగారికి!

మిమ్మల్నిలా పిలవడం ఇదే మొదటిసారి—బహుశ ఆఖరిసారి కూడా! ఎందుకో అనిపిస్తోంది ఇక బ్రతకనని.

జీవితంలో నేను కోరినది ఒక్కటి -- మధుసూధనాన్ని ప్రయోజకుడిని చేయడం. మీ అందరి సహకారంతో నా కోర్కె తీర్చుకో గలిగాను. వాడు డాక్టరు కబోతున్నాడు.

అయితే, చివరలో నేను ఆశించనిది మరొకటి జరిగింది. అది వాడి తండ్రి, మేనమామ వాడిని దగ్గరకు తీయడం. ఆఖరికి వాడి చదువు భారాలు కూడా వీళ్ళే వహించడం.......వాడు కూడా వాళ్ళతో కలిసిపోవడం చిత్రం కదూ మాస్టరుగారూ, రక్తం ఎక్కడికి పోతుందిట?

మొత్తానికి నా నెత్తిమీది బరువు దింపారు వాళ్ళు. చివరికి మా అన్నయ్య కూతురి నివ్వ బోతున్నాడు. మధు కేవలం మామయ్య అన్న గౌరవంతో ఈ పెళ్ళికి వప్పుకున్నాడేమోనని. ఇందాక వాడిని పరీక్ష చేశాను. చివాట్లు వేశాను. "నన్ను కాదన్న వాడు నీకు మామయ్య ఎలాగవుతాడు?" అనడిగాను.

"మావయ్యగా కాకపోతే ఉమాపతిగా చూస్తున్నాను" అనుకోమన్నాడు. అదీ కాకపోతే, "రాధిక కోసం ఇష్ట పడ్డాననుకో" మన్నాడు. "ఏది ఏమయినా నా నిర్ణయం మారేదిలేదు. రాధిక నా భార్య" అన్నాడు.

ఆనందపడ్డాను. వీడి నిర్ణయాన్ని మార్చడం ఎవరి తరమూ కాదు! కాబట్టి వీడు మనస్ఫూర్తిగా చేసుకుంటున్నా డీ పెళ్ళి.

ఇక నా కీ లోకంలో పని తీరిపోయింది. నాకు తెలుసు—నేను మృత్యువుకి రోజుల దూరంలో ఉన్నానని.

నా వాళ్ళు నన్ను స్వీకరించకపోయినా బాధ లేదు. నా కొడుకుని చేరదీశారు అంతే చాలు.

మీ సహకారానికి కృతజ్ఞురాలిని. ఇందిరకి ఆశీస్సులు.

మీ చెల్లెలు,
రాజేశ్వరమ్మ".

అయితే ఆమె మధుసూధనం వివాహాన్ని, అతను తన వాళ్ళతో చేరడాన్ని హర్షిస్తోందా లేక అందుకు బాధ పడుతోందా అన్న విషయం స్పష్టంగాతేలలేదు.

ఉత్తరాన్ని మరోసారి చదివాను. అప్పుడు మరో అనుమానం కలిగింది — కొంపదీసి ఈమెది ఆత్మహత్య కాదు కదా అని.

ఆలోచించాను కాని ఒక నిర్ణయానికి రాలేకపోయాను.

నా జీవితంలోకి ఒక సమస్యతో ప్రవేశించింది. ఒక సమస్యనిచ్చి నిష్క్రమించింది. ఆమె గురించి ఎటు చెప్పడం కష్టమే.

ఆమె శరీరానికి చేయవలసిన అంత్యక్రియల కోసం వాళ్ళ ఇంటికేసి బరువుగా నడిచాము. ★


'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" x 2", 4" x 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి.



బాధగా
అసహ్యంగా వుండే
గజ్జి నుంచి
త్వరగా బయటపడండి



గజ్జి అంటువ్యాధి. అది మీ కుటుంబంలోని యితరులకు వ్యాపించకుండా వుండేందుకు ముందుగానే, మీరు అమృతాంజన్ లిమిటెడ్ వారి డెర్మల్ ఆయింటుమెంటును వాడి త్వరగా, పూర్తిగా ఉపశమనం పొందండి. మళ్లీ ఆ అంటువ్యాధి తల యెత్తకుండా వుండాలంటే, మీరు తగిన జాగ్రత్త తీసుకోవడం అవసరం.
అమృతాంజన్ డెర్మల్ ఆయింటుమెంటు డబ్బా ఒకటి ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి. అది తామరకూ, పాసినకాళ్లకూ కూడా పనికివస్తుంది.



అమృతాంజన్
లిమిటెడ్ వారి
డెర్మల్
ఆయింట్‌మెంట్
అమృతాంజన్ లిమిటెడ్
14/15, లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూ ఢిల్లీ-1
NWT/AM/D/2344



డాక్టర్ వృత్తి చేయండి



విరామకాలంలో ఇంటిలో పోస్టల్ ట్యూషన్‌ద్వారా హోమియోపతి చదివి, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి.
ప్రాస్పెక్టస్ ఉచితం. వెంటనే వ్రాయండి.
Indian Homoeopathic College,
(APW), JULLUNDUR CITY



పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17






ఐ టెక్స్ (కాటుక)
శాస్త్రీయంగా తయారైనది
చిన్నపిల్లలకు కూడా వాడవచ్చును.
ఐటెక్స్ బిందీ
అనేక రంగులలో లభించును
అరవింద్ లేబరేటరీస్
పి. బి. 1415, మద్రాసు-17.
తెలంగాణా జిల్లాలకు, హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు
ప్రగతి ఏజెన్సీస్,
పులిపాటివారి వీధి. విజయవాడ 1.